క్లుప్తంగా

'సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు'



కామారెడ్డి అర్బన్ : అకస్మాత్తుగా గుండెపోటుతో బాధపడే వారిని ఆస్పత్రికి చేర్చేవరకు ముందుగా సీపీఆర్ నిర్వహించి ప్రాథమిక చికిత్స నిర్వహిస్తే ప్రాణపాయం నుంచి బయట పడేయవచ్చని నిజామాబాద్ మెడికవర్ ఆస్పత్రి వైద్యుడు ఫణి అన్నారు. శుక్రవారం కామారెడ్డి పీజేఆర్ఎస్ స్మార్ట్ డిగ్రీ కళాశాలలో సైన్యసేనా ఆధ్వర్యంలో సీపీఆర్‌పై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ గురు రాఘవేంద ర్‌రెడ్డి, ప్రిన్సిపల్ విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

పంటలను నమోదు చేసుకోవాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏవో నరేశ్ సూచించారు. శుక్రవారం ఆయన సోమారం తండాను సందర్శించారు. పంటల నమోదును పర్యవేక్షించారు. ఏఈవోలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కరుణేశ్వర్, రైతులు ఉన్నారు.

షబ్బీర్ అలీకి సన్మానం



మాచారెడ్డి : పాల్వంచ మండలంలో రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా శుక్రవారం పాల్వంచ మర్రి వద్ద రైతులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని తెలంగాణా బీసీ మహాసభ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆదె ప్రవీణ్ కుమార్, కుర్రు రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు సాయి కుమార్‌లు శాలువా కప్పి సన్మానించారు.

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి క్రైం : జిల్లా కేంద్రం లోని గిరిజన బాలుర వసతి గృహాన్ని ఏఐఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం సందర్శిచారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ సంపత్ రాజు మాట్లాడుతూ గిరిజన బాలుర హాస్టల్‌లో సమస్యలున్నాయన్నారు. ఇంటర్ నుండి డిగ్రీ, పీజీ చదువుతున్న ఎస్టీ విద్యార్థులకు మూడేళ్లుగా స్కాలర్‌షిప్ అందట్లేదన్నారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గిరిజన బాలుర కళాశాల వసతి గృహం విద్యార్థులు సురేష్, సుభాష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఏఈ, లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డి : విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతు రవి మృతికి కారణమైన ఏఈ సత్యనారాయణగౌడ్, లైన్‌మెన్ కాశీరాంపై చర్యలు తీసుకోవాలని అన్నాసాగర్ రైతులు విద్యుత్‌శాఖ ఏడీ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందిచారు. రవికి సంబంధించిన పొలంలో 11 కేవీ విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని ఏడాది కాలంగా చెప్తున్నా వారు పట్టించుకోకపోవడంతోనే రవి ప్రాణాలను కోల్పోయారని ఫిర్యాదు చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, గురుప్రతాప్, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో శుక్రవారం స్వచ్ఛంద సేవా సంస్థ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, జిల్లా కో ఆర్డినేటర్ డి శ్రీనివాస్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మాత్రలు ఇచ్చారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, టీచర్ దుర్గాప్రసాద్, లోహిత, కవిత ఉన్నారు.





కాటేపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు, బరంగెడ్డిలో, రాంపూర్‌లో..

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం



భూంపల్లిలో రుణమాఫీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



మద్నూర్‌లో ఎడ్లబండ్ల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

- అంచెలంచెలుగా పథకాలన్నీ అమలు చేస్తాం
- ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, లక్ష్మీకాంతారావు

సదాశివనగర్/తాడ్వాయి/గాంధారి/రామారెడ్డి/రాజంపేట : కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని భూంపల్లి గ్రామంలో, తాడ్వాయిలోని ఎర్రాపహాడ్‌లో, గాంధారి మండలంలో, రామారెడ్డి మండలంలో, రాజంపేటలోని కొండాపూర్‌లో పంటరుణ మాఫీ సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడైనా అర్హత ఉండి పంట రుణం మాఫీ కానివారు తన దృష్టికి తీసుకురావాలన్నారు. అంచెలంచెలుగా అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా పలువురికి రైతు రుణమాఫీ చెక్కులను అందజేశారు. సీఎంరేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి చిత్ర పటాలకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధికి రూ. 244 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. రామారెడ్డి కాలభైరవ ఆలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పూజలు చేశారు. తాడ్వాయి, రామారెడ్డిలో ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. సదాశివనగర్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, తాడ్వాయి పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాజంపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శిలాసాగర్, జైగౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ ఇర్షాదొద్దీన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సంపత్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు తదితరులున్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

మద్నూర్(జుక్కల్) : రాష్ట్రంలోని రైతుల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఎడ్లబండ్లపై ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి ఎలా ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్షీరాభిషేకాలు..

బాన్సువాడ/పిట్లం/పెద్దకొడప్‌గల్ : ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయడం కాంగ్రెస్‌కే సాధ్యమైందని బీర్కూర్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనిగిరావ్ దేశ్‌ముఖ్ అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండలం బరంగెడ్గిలో రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. పిట్లం మండలంలోని రాంపూర్ జీపీ వద్ద, కుర్తిలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. పెద్దకొడప్‌గల్‌లోని కాటేపల్లిలో మండల కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల, గ్రామ కాంగ్రెస్ నాయకలు పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్‌లో వైద్య శిబిరం



సౌత్‌క్యాంపస్‌లో చికిత్స చేస్తున్న వైద్యులు



పిట్లంలో కంటి పరీక్షలు చేయించుకున్న వృద్ధులు

భిక్కనూరు : తెయూ సౌత్‌క్యాంపస్‌లో రాజంపేట ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరంను శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 91 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, వార్డెన్లు సునీత, యాలాద్రి, పబ్లిక్ రిలేషన్ అధికారి సరిత, కాంట్రాక్ట్ అధ్యాపకులు నారాయణ, రమాదేవి, బాలికల వసతి గృహ కేర్ టేకర్ హారిక, ఆరోగ్యకార్యకర్తలు జ్యోతి శ్రీలత, రజిత తదితరులున్నారు.

పిట్లం(జుక్కల్): పిట్లం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు భాస్కర్ రెడ్డి 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాశిరెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, జోన్ చైర్మన్ కిషన్, వేణు, సంతోష్, శేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని సక్సెస్ చేయాలి



దోమకొండ : రైతులకు రుణమాఫీ సందర్భంగా నేడు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో మండలంలో బైక్ ర్యాలీని సక్సెస్ చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తిరుమల్ గౌడ్ కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, రామస్వామి గౌడ్, కాంగ్రెస్ నాయకులు శంకర్ రెడ్డి, నర్సారెడ్డి తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

శాకాంబరి అలంకరణలో సంతోషిమాత



భిక్కనూరు : మండల కేంద్రంలోని శ్రీ నగరేశ్వరాలయంలో ఉన్న సంతోషి మాత ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలను శుక్రవారం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారిని కూరగాయలతో శాకంబరీగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహికంగా మణిద్వీప వర్ణన, లలితాదేవి సహస్రనామాలను పఠించారు.

నీలకంఠ సంఘం ఆధ్వర్యంలో బోనాలు



భిక్కనూరు : మండల కేంద్రంలో నీలకంఠం సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాసం బోనాల ఊరేగింపును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలకంఠ మహిళలు భూలక్ష్మమ్మ, మహంకాళి, అమ్మవార్లకు మల్లన్నకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా బోనాలను ఊరేగించారు. దారిపొడవున పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు అలరించాయి.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. ఆషాఢమాసం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 26న మైసమ్మకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బోనాలు తీస్తామని సభ్యులు తెలిపారు.

ప్రారంభమైన మైసమ్మతల్లి ఉత్సవాలు



బీబీపేట : మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్ట మీద ఉన్నటువంటి మైసమ్మ అమ్మవారి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుండి బైండ్లోల్ల ఆట పాటలతో మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అమ్మవారికి వస్త్రాలు సమర్పించారు. ఆదివారం శ్రీ మహంకాళి అమ్మవారికి బోనాలతో పాటు మైసమ్మ అమ్మవారికి బోనాలు తీస్తున్నట్లు తెలిపారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు పల్లకీ సేవ నిర్వహించారు. శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, పాదుకలను రకరకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు బాపురావు, సిద్దిరాంరెడ్డి, రాధాకిషన్, దేవరెడ్డి తదితరులున్నారు.

వాసవి మాతకు పూజలు



కామారెడ్డి అర్బన్ : ఆషాఢ శుక్రవారం సందర్భంగా కామారెడ్డి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి 21 రకాల ప్రసాదాలతో నైవేద్యం, అలంకరణ చేసి విశేషపూజలు, పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్‌గుప్తా, కార్యదర్శి భూమేష్‌గుప్తా, ప్రతినిధులు తదితరులున్నారు.

బల్కంపేట్ ఎల్లమ్మకు చైర్‌పర్సన్ మొక్కులు



కామారెడ్డి క్రైం : మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ శుక్రవారం బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన రూ.2 రెండు లక్షల రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ఆషాఢంలో కామారెడ్డి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నానన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న బాణాల లక్ష్మారెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి బీజేపీ పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎల్లారెడ్డి నియోజక వర్గం ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వివిధ బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో నెరవేరుస్తామని చెప్పి 8 నెలలు అవుతున్నా పట్టించుకోవట్లేదన్నారు. ఎన్నికల్లో భాగంగా ఎకరానికి రూ. 15 వేల చొప్పున రైతుబంధు, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ. 2,500, రైతు కూలీలకు రూ. 12,000లు, వరికి క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వలేదని విమర్శించారు. రేషన్ కార్డులు, ఐటీలు అనుకుంటూ రైతుల్లో కొంతమందికి మాత్రమే రుణమాఫీ చేస్తున్నారన్నారు. రైతులకు పూర్తిన్యాయం చేయకుండానే కాంగ్రెస్ సంబురాలు చేసుకుంటున్నారన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు దమ్ముంటే ఏయే బ్యాంకుల్లో ఎంత మంది రైతులు రుణాలు తీసుకున్నారో, ఎంతమందికి రుణమాఫీ చేశారో పూర్తివివరాలు వెల్లడించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి, నాయకులు పైలా కృష్ణారెడ్డి, వెంకట్‌రావు, రవీందర్‌రావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని బ్రాహ్మణపల్లి, దేవాయిపల్లి గ్రామ శివారులో నుడుస్తున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి రాజారాం పరిశీలించారు. నర్సరీల్లో అన్నిరకాల మొక్కలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామంలో ఉన్న మంచినీళ్ల ట్యాంకులను ఎప్పటికప్పుడు కడుగుతూ శుభ్రంగా ఉంచాలన్నారు. డ్రెయినేజీల్లో మురికి తొలగించి శుభ్రం చేయాలన్నారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, కార్యదర్శి వీరేష్, టెక్నికల్ అసిస్టెంట్ మహిపాల్ రెడ్డి ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి



నిజాంసాగర్(జుక్కల్) : ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు తమ వంతుగా కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి జుక్కల్ నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ప్రజా సమస్యలకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలి



పీహెచ్‌సీలో సూచనలిస్తున్న తహసీల్దార్ నరేందర్



సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి బావయ్య

లింగంపేట(ఎల్లారెడ్డి) : సీజనల్ వ్యాధులబారిన పడి అస్వస్థతకు గురైన వారి వివరాలను ఇంటింటికీ వెళ్లి సేకరించాలని తహసీల్దార్ నరేందర్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వ్యాధులపై మండల ప్రత్యేకాధికారి రాజు, ఎంపీడీవో నరేష్‌తో కలిసి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో డెంగీ తీవ్రంగా ఉందన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి జ్వర బాధితుల వివరాలు సేకరించాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. వారి వెంట వైద్యాధికారి హిమబిందు, ఏపీఎం శ్రీనివాస్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, వైద్య సిబ్బంది యాదగిరి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

గాంధారి(ఎల్లారెడ్డి) : వానాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ బావయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండలాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షించారు. వాటర్‌ట్యాంకుల్లో క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేసి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీవో సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని ఎస్సై కోనా రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పోచారం చౌరస్తా 161 జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్సై రాములు పోలీస్ సిబ్బంది, రవి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన అంగన్‌వాడీలు



నిజాంసాగర్(జుక్కల్) : సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కమిషనరేట్ ముట్టడికి శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. సీఐటీయూ జోన్ ఇన్‌చార్జి సురేశ్‌తో కలిసి జుక్కల్ నియోజకవర్గ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పలు వాహనాల్లో తరలి వెళ్లారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

భిక్కనూరు : ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గజ్జెల భిక్షపతి డిమాండ్ చేశారు. శుక్రవారం భిక్కనూరు మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం మాట్లాడుతూ ముదిరాజ్ కులాన్ని బీసీ డీ గ్రూప్ నుంచి ఏ గ్రూపులోకి మార్చాలని, చెరువుల్లో, కుంటల్లో చేపలు పట్టుకోవడానికి ముదిరాజ్‌లకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గజ్జెల భిక్షపతి, నేతలు జనగమ శ్రీనివాస్, లక్ష్మీనర్సింలు, ఉప్పరి రాములు, గువ్వ బుచ్చయ్య, మల్లేషం, కర్నాల శ్రీనివాస్, గంగళ్ల రవీందర్ తదితరులున్నారు.

సంక్షిప్తం

నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి రాక

భిక్కనూరు : జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు నేడు భిక్కనూరు మండల కేంద్రానికి రానున్నట్లు పీసీసీ కార్యదర్శి ఇంద్రకరన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి అన్నారు. శుక్రవారం వారు భిక్కనూరులో మాట్లాడుతూ రుణమాఫీ సంబురాల్లో పాల్గొనేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ విచ్చేస్తున్నారన్నారు.

రక్తదాతలకు అభినందన సభ..

కామారెడ్డి అర్బన్ : ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో నేడు శనివారం రక్తదాతలకు సన్మానం ఉందని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ ఎన్. బాలు తెలిపారు. ఉదయం 10గంటలకు హైదరాబాద్‌లోని ముషీరాబాద్ వైశ్య బాలుర హాస్టల్‌లో రక్తదానం కోసం కృషి చేస్తున్న 70 మంది సేవకులకు అవార్డులు ఇస్తారన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండలంలోని ఖండేబల్లూర్ గ్రామంలో పారిశుధ్య పనులను శుక్రవారం స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. రోజూ కాలువలు శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

'ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మరు'

రాజంపేట : కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని రాజంపేట కాంగ్రెస్ అధ్యక్షులు బెస్త చంద్రం, ఆంద్యాల సురేశ్ అన్నారు. శుక్రవారం రాజంపేట గంగపుత్ర సంఘ భవనంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడితే బీఆర్ఎస్ నాయకులకు మింగుడు పడట్లేదన్నారు.

'డీఈవో బెదిరింపులు మానుకోవాలి'

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో అక్రమాలకు పాల్పడ్డ నిజామాబాద్ జిల్లా డీఈవో బెదిరింపులు మాని, సమస్య పరిష్కారం కోసం చర్చలకు పిలవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డిటిఎఫ్) ఉమ్మడి జిల్లా పూర్వాధ్యక్షుడు విజయరామరాజు అన్నారు. శుక్రవారం ప్రకటన చేశారు. డీఈవో అక్రమాలను లేవనెత్తిన డీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన డీఈవో బెదిరింపులు మానుకోవాలన్నారు.

ప్రభుత్వ న్యాయవాదికి సన్మానం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా విధులను నిర్వర్తించిన వీరయ్యను న్యాయమూర్తి హారిక శుక్రవారం సన్మానించారు. ఎల్లారెడ్డి కోర్టులో తొమ్మిదేళ్లుగా సేవలందించిన వీరయ్య ఖమ్మంకు బదిలీ కావడంతో ఆయనను బార్ అసోసియేషన్ అధ్యక్షులు నవీద్, న్యాయవాదులు తదితరులు సన్మానించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

బాన్సువాడ రూరల్ : ప్రజలు న్యాయస్థానాలు, చట్టాలపై కనీస అవగాహన ఉండాలని న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది లక్ష్మీనారాయణ మూర్తి అన్నారు. శుక్రవారం సోమేశ్వర్, దేశాయిపేట్‌లో సదస్సులు నిర్వహించారు.